# నందనవనం - 15

అరుగుమీద కూర్చుని చేటతో ఏదో బాగుచేసుకుంటున్న శ్రీవల్లి ఎవరో అమ్మాయిని రవళి వెంటబెట్టుకుని రావటం చూసింది. చేటను పక్కన పెట్టేసి ''రండమ్మా....'' అంది.

''అమ్మా... ఈ అమ్మాయి మా బంధువుల అమ్మాయే. మా ఊరే. నాకు చెల్లెలు వరస. ఇద్దరం ఉదయమే మా అత్త దగ్గరకు వచ్చాం.... మిమ్మల్ని చూస్తానంటేనూ వెంటబెట్టుకుని వచ్చాను... పేరు... రాజేశ్వరి. మేం అంతా రాజీ అంటాం...'' అంటూ రవళి పరిచయం చేసింది.

''అలాగా'' అన్నట్లు చూసిన శ్రీవల్లి చిరునవ్వుతో ''కూర్చోండి'' అంది.

ఇద్దరూ ఛెంగున ఎగిరి ఎదురు అరుగుమీద కూర్చున్నారు. ఒక నిమిషం తర్వాత రవళి అసలు విషయం చెప్పింది. ''ఈ సాయంకాలం పట్నంలో బంధువులింటిలో ఏదో శుభకార్యం ఉంది, వీళ్ళంతా వెళ్తారట...! క్రిందటిసారి ఈ రాజీ ఎవరో చుట్టాలింట్లో పెళ్ళికి హాజరైతే, ఇదేమి ముస్తాబని అందరూ ఎగతాళిగా చూశారట! అందుకని ఏదో డ్రెస్సు కొత్త మోడల్‌ది కొనుక్కుంది. మీరు బాగా రెడీ చేస్తారని చెప్పి తీసుకువచ్చాను...!''

వాళ్ళ చేతిలో బట్టలుకాబోలు ఉన్న సంచీని శ్రీవల్లి అప్పుడు గమనించింది.

''అలా ఎందుకు చెప్పావు....? నేనేమో పెద్దదాన్నా... నేను రెడీ చేస్తే 'ముసలమ్మ' అనే పేరు వస్తుంది. నీలాంటి వాళ్ళయితే... అంటే... తన వయసు వాళ్ళయితేనే బావుంటుంది. లేకపోతే... ఈ రోజుల్లో... బ్యూటీ క్లినిక్ లంటూ చాలానే వచ్చాసాయిగా... కొంచెం ముందుగా బయలుదేరి వెళ్తే... అక్కడికి వెళ్ళి మేకప్

చేయించుకుని... అటే ఫంక్షన్‌కూ వెళ్ళొచ్చు. ఇపుడంతా ఇదే పద్ధతికదా...!'' సలహాలా చెప్పింది శ్రీవల్లి.

''నిజమేనమ్మా... కానీ వీళ్ళ అమ్మా వాళ్ళు ఒప్పుకోవటంలేదు. ఏదో మొహానికి రంగులు రాసి... పూసి డబ్బులు లాగటమే కదాని దీని మాటల్ని కొట్టిపారేసారట...!''

రవళి మాటలకు శ్రీవల్లి ఆశ్చర్యంగా చూస్తూ ''అది సరేగానీ... నేను బాగా ముస్తాబు చేయగలనని ఎందుకనుకున్నావూ...?'' అనడిగింది.

''అంటే...'' అంటూ రవళి ముసిముసి నవ్వులు నవ్వింది. ''ఆల్బమ్‌లోని మీ ఫోటోలు చాలా చూశాను కదమ్మా.... ఆ రోజుల్లోనే అంత మోడ్రన్‌గా రెడీ అయ్యారుగా, ఇప్పటి పద్ధతులు మీకు ఇంకా బాగా తెలిసి ఉంటాయనిపించింది...!''

శ్రీవల్లి నిట్టూర్చింది.

''రవళీ.... నా ఉద్దేశ్యం, ఇష్టం చెప్పనా... ఏరకం డ్రెస్సు వేసుకున్నా ఫరవాలేదుగానీ దుస్తులు ధరించటంలోని ప్రధానోద్దేశాన్ని మరిచి పోయినట్లుగా మాత్రం ఉండకూడదు! మగవాళ్ళతో అన్ని రంగాల్లోనూ ఆడవాళ్ళు పోటీ పడి నెగ్గుకు రాగలమని నిరూపిస్తున్నారు! ఎవరైనా ప్రతిభాపాటవాలతోనే ఉన్నతి సాధించగలగాలిగానీ... స్త్రీత్వాన్ని ప్రదర్శించి కాకూడదు కదా! అలా అయితే మన గౌరవాభిమానాల్ని మనమే తగ్గించుకున్నట్లుగా ఉండదూ? ఆడ, మగ అనే తేడా లేకుండా అందరూ అందంగా కనబడాలని అనుకోవటం సహజమే! అయితే సినిమా తారలు ఏవో ఫ్యాషన్లనూ అనుకరిస్తూ అవకాశాల కోసం ఫోటో సెషన్సు అంటూ పెట్టి మగవాళ్ల ఆకలి చూపులకు విందుచేస్తున్నట్లుగా అవయవ ప్రదర్శన చేసి ఫోటోలు విడుదల చేస్తూంటారు!

సినిమా రంగానికి నటీమణుల అవసరమూ ఉంది. వీళ్ళు కూడా అవకాశాలను ప్రతిభద్వారా పొందాలనుకోవాలిగానీ వ్యక్తిత్వాన్ని దిగజార్చే అలాంటి వేషాలు ఎందుకూ? అందరూ అలాంటి పనులను వ్యతిరేకిస్తే  సినిమాలు తీసేవాళ్ళు మాత్రం ఏం చేయగలరూ? దిగిరావల్సిందే కదా. కట్టుబాటు లేకనే అలాంటి పోటీలతో వెనకబడిపోతా మేమోననే భావనతో అందరూ ఎలాంటి వస్త్రధారణకయినా సిద్ధమేనన్న సిగ్నల్ ఇస్తూంటారేమో! ఇపుడు.... మనవాళ్ళనే చూడు... పైట అనేది పెద్దవాళ్ళకు కాదుగానీ, వయసు పిల్లలందరికీ నిషిద్దమైపోయింది! రాజేశ్వరి అనుభవాన్ని బట్టే చెప్పొచ్చుగా, ముసలమ్మలంటారేమో ననే భయం పిల్లలకు పట్టుకుందని! అందుకే, ఎంతమంది అతిథులు ఆడమగా ఉండే ఫంక్షన్‌లోనైనా స్టేజిమీద... ఒంటికి అతుక్కునే జాకెట్టూ లంగాతోనే వస్త్రధారణ ఉంటుంది! పైట అవసరం లేనివిధంగా ఎబ్బెట్టులేకుండా ఎన్నో రకాల డ్రెస్సులూ ఉంటాయి. వాటిని ఎంచుకున్నా బాగానే ఉంటుంది! కానీ అలా చేయరు... చేస్తే నాగరికత తెలియని వాళ్ళ జాబితాలోకి చేరిపోతామేమోననే సంకోచం! అందుకే పెద్దలూ పిల్లలకు ఏ విషయమూ, చెప్పటానికీ సాహసించటం లేదనిపిస్తోంది! నలుగురితో నారాయణా అన్నట్లుగా ఉండాలికదా అని నచ్చచెప్పుకోవటమే, వాళ్ళు చేయగలిగింది! ఒకవేళ చెప్పినా పిల్లలు లెక్క చేసే పద్ధతీ లేదు! కొందరయితే... పైటనో లేక చున్నీనో పూర్తిగా తీసివేయటం కాకుండా... ఒక భుజంమీద కొంచెంగా ఉండేట్లు స్టైలుగా జారుస్తారు... అదో విధమైన ఫ్యాషన్ అన్నమాట!

ఇలాంటి రకరకాల రీతుల్ని గమనిస్తున్నానంతే తప్ప... నేనేం ఎవరికీ ఎటువంటి సలహాలూ ఇవ్వను... అనవసరం కదాని! ఇవి ఎవరికీ తెలియని కొత్త సంగతులేం కావుకూడా...!

పైగా కొందరు... ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు దుస్తులు వేసుకోవటానికీ హక్కులేదా? ఇంకొకరి పెత్తనం ఏమిటీ అని ప్రశ్నిస్తారు? నిజమేగానీ, మనకిష్టం అని పూర్తిగా దుస్తుల్ని మానేయటం మరి నిషిద్ధమేగా...? అలా చేస్తే... అభ్యంతరం చెప్పని వాళ్ళు ఎవరైనా ఉంటారా...? ఇంకొక వాదనా విన్నాను.... చూసేవాళ్ళ దృష్టిలోనే లోపం ఉంటుందట! అందుకని అది మార్చుకోవటమే ముఖ్యమని! ఒకమ్మాయి మోకాళ్ళకి బాగా పైకి పొట్టి నిక్కరు వేసుకుని, పైన టాప్ వేసుకుని... మార్కెట్‌కి వచ్చింది. మగవాళ్ళ చూపుల్లోని భావం తనకి వెగటు కలిగించిందనీ, అలా చూసే పద్ధతిని వాళ్ళు మార్చుకోవాలిగానీ 'మా కిష్టమైన దుస్తులు మేం ధరించకూడదా?' అని అడిగింది. బావుందికదూ! ఎవరైనా, అందంగా ఉన్న వాళ్ళనీ పట్టి పట్టి చూస్తారు... మగవాళ్ళే కాదు, ఆడవాళ్ళు చేస్తారాపని! ఎవరిసంగతో ఎందుకూ... నేను కూడా నాకు బాగా నచ్చినట్లు, చక్కని చిరునవ్వుతో మాట్లాడేవాళ్ళనీ, చిట్టి పొట్టి మాటల చిన్నారుల్నీ ఇష్టంగా మరీమరీ చూస్తాను! ఎవరూ తప్పుపట్టలేరు కదా! అలాగే విడ్డూరంగా... విపరీతంగా ముస్తాబైన వాళ్ళనీ చూస్తాం!

విలువైన వాటిని ఇంటిముందు నిర్లక్ష్యంగా వదిలేస్తే... ఎవరైనా దొంగలు ఎత్తుకెళ్తారేమోననే ఆలోచనతో ఇంట్లో భద్రపరుస్తాం... ఇంట్లోకీ జొరబడి దొంగలు ఎత్తుకెళ్ళే అవకాశమూ ఉంటుంది.... అయినా మన జాగ్రత్తలో మనం ఉండాలని అనుకుంటాం కదా... ఆ పైన ఏదయినా జరగొచ్చుననుకో దొంగలకా దొంగబుద్ధి ఉండటం మాత్రమే నేరమని ఎవరైనా వాదించగలరా...? ఒకవేళ బయటనే వదిలేస్తే... పోయినట్లైతే, మన నిర్లక్ష్యాన్నే తప్పు పడతారు కదా...! సరే, ఇదంతా వేరే గొడవగానీ, వదిలేద్దాం!

నా అభిప్రాయం నిక్కచ్చిగా చెప్పాలంటే... చిన్న చిన్న మెళకువలు తెలుసుకుని.... మనల్ని మనమే చక్కగా తీర్చిదిద్దుకోవచ్చునని... ఆ పని ఎవరికో అప్పగించి, అప్పనంగా రుసుము చెల్లించాల్సిన పనీ లేదని!

జుట్టు తీరును బట్టీ, మన ఇష్టాన్ని బట్టీ చక్కగా దువ్వుకుని... జడ అల్లుకున్నా, పోనీ టెయిల్ వేసినా, వదులుగా వదిలేసినా... మనకెలా నప్పుతుందో సౌకర్యంగా ఉంటుందో తెలుసుకుని... అలాగే చేయొచ్చు! అలాగే సన్నగా కాటుకు దిద్దుకోవటం లాంటివీ అలంకరణలో భాగమే.

కొత్త కొత్త పద్ధతులు తెలిస్తే... అలా అందంగా తీర్చి దిద్దుకోవచ్చు, మన్నలి మనమే... ఆధునికత, ఫ్యాషన్ పేరిట... అందాన్ని చెడగొట్టుకోవటం... అసభ్యంగా కనిపించటం... ఇది మాత్రం కూడదని నా అభిప్రాయం! అంతే!

సందర్భం వచ్చింది కాబట్టి.... నా అభిప్రాయాల్ని నేను ఏకరువు పెట్టేశాను. నా పద్ధతే కరెక్టని వాదించను...! ఆఖరుగా ఎవరి ఇష్టం వారిదే నన్న మాటను మాత్రం ఒప్పుకోవాల్సిందే! అలాగే... ఏ రకమైన అలంకరణ అయినా మనకు నప్పేదే మనం ఎంచుకోగలగాలి! అదీ ఒక కళే అనుకోవాలి!''

చెప్పటం ముగించిన శ్రీవల్లి అటూ ఇటూ చూసి... ''అవునూ... నీతో వచ్చిన రాజేశ్వరి ఏదీ... కనిపించదేం...?'' అనడిగింది ఆశ్చర్యంగా.

రవళి నవ్వుమొహంతో ''అటు... చూడండీ...'' అంటూ పరుగుపరుగున నడుస్తోన్న రాజేశ్వరిని చూపించింది. చేతిలో బట్టలు ఉన్న కవరూ ఉంది.

‘‘అత్తావాళ్ళింటికే అయివుంటుంది. మాతో వచ్చిన వాళ్ళంతా అక్కడే ఉన్నారుగా, నేనూ వెళ్ళొస్తానమ్మా...’’ అంటూ రవళీ లేచి నిలబడిరది.

ఆ రాజేశ్వరి హఠాత్తుగా, అంత హడావుడిగా ఎందుకు వెళ్లిపోయిందోనని ఆలోచిస్తూ ఒక క్షణం అలాగే నిలబడిపోయింది శ్రీవల్లి.

ఆ మరునాడు... రవళి వచ్చి సెల్‌ఫోన్‌లోని నాలుగైదు ఫోటోల్ని శ్రీవల్లికి చూపించింది.

అంతకు ముందు రోజు జరిగిన ఫంక్షన్ లో రాజేశ్వరి తీయించుకున్న ఫోటోలవి! తన మాటల ప్రభావంతోనే ఆ అమ్మాయి తొందరగా వెళ్ళాలనే ఉద్దేశ్యంతో, అలా వెళ్ళిపోయి... తన కిష్టమైన విధంగా తనే ముస్తాబయిందనే విషయాన్ని శ్రీవల్లి ఆ ఫోటోల్ని చూస్తూనే గుర్తించింది! ఆనందమూ కలిగింది! సన్నగా కాటుకు దిద్దుకున్న సోగకళ్ళ క్లోజప్ ఫోటో ఒకటి చూసి... రాజేశ్వరి తనలోని అందాన్ని బాగానే గుర్తించగలిగిందన్నమాట!’ అనుకుంది.

‘‘ప్రతీవారిలోనూ కొన్ని ప్లస్ పాయింట్స్, కొన్ని మైనస్ పాయింట్సూ ఉంటూనే ఉంటాయి కొంచెం ఎక్కువ తక్కువలుగా...! అది తెలుసుకుని మంచి లక్షణాలని మెరుగుపరచుకోగలిగితే, అందం మన స్వంతమైనట్లే కదూ...?’’ అంది శ్రీవల్లి రవళితో.

‘‘అవునమ్మా... బాగా చెప్పారు...! మా రాజీ కూడా ఇది అర్థం చేసుకోగలిగింది!’’ అంది. ‘‘నిజం సుమా... ‘చేతకాకపోతే, ఆ మాటే చెప్పొచ్చుగా, ఈ ఊకదంపుడు ఉపన్యాసమంతా ఎందుకు...?’ అనలేదు అంతవరకూ ఫరవాలేదులే...!’’ అంటూ శ్రీవల్లీ నవ్వింది.

* * *

ఆ రోజు... అరుగులబడి సమావేశానికి పున్నమ్మ అనబడే ఆవిడ వచ్చింది. ఆడవాళ్ళ గుంపుమధ్యలో కూర్చుంది.

''పెద్దమ్మా... ఈ వేళ నీ అమెరికా ప్రయాణం కబుర్లు తూ.చ. తప్పకుండా చెప్పాలి. అది వినాలనే తీరిక చేసుకుని నేనొచ్చాను. ఇలా కూర్చుని... కథలూ కబుర్లూ వెళ్ళబోసుకోవటం బావుంటోందని అందరూ అంటున్న మాటను విని  ఎప్పటినుండో రావాలనుకుంటున్నా గానీ, ఇదిగో ఇన్నాళ్ళకి వీలయింది! నిన్నూ వెంటబెట్టుకు వస్తున్నానని మీ మనవరాలు సుందరి చెప్పిందని నాతో మా కోడలు అంది. అందుకే మరోసారి అనుకోకుండా ఈ రోజే వచ్చాను...!'' అంది ఒకామె పక్కనే కూర్చున్న పున్నమ్మతో.

మరొకావిడ ''పిన్నీ... నువ్వు ముందు కూర్చో... అందరికీ నీ మాటలు చక్కగా వినిపిస్తాయి...'' అంటూ సూచించింది. పున్నమ్మ కులాసాగా నవ్వి... లేచి వచ్చి ముందు కూర్చుని అంది. ''ఇలా అడుగు తున్నారేమిటర్రా... ఇంకా అమెరికా కబుర్లు కొత్తగా వినాలనుకున్న వాళ్ళూ ఉన్నారా...! ఆశ్చర్యంగా ఉందే...! ఇవన్నీ ఎపుడో పాతబడిపోయిన సంగతులే కదా... నేను కొత్తగా చెప్పటానికేమీ లేవుకూడా...'' అంటూ మళ్ళీ నిట్టూర్చింది.

''ఆ మధ్య మా బంధువులింటికి పెళ్ళికి వెళ్ళానా... అక్కడ పెద్దవాళ్ళందరూ ఓ చోట కూర్చున్నపుడు మునుపు అయితే... మొక్కు తీర్చుకోవటానికి తిరుపతి వెళ్ళొచ్చాం, కొడుకు కోడలితో వ్రతం చేయించాలని అన్నవరం వెళ్తున్నాం... లాంటి కబుర్లు వినబడేవి కదా, కానీ ఇపుడు మాత్రం అందరూ కాలిఫోర్నియా, డల్లాస్, చికాగో అంటూ వాళ్ళు వెళ్ళొచ్చిన... చూసొచ్చిన అమెరికా నగరాల కబుర్లే...! నేను నోరు తెరుచుకుని విచిత్రంగా విని, ఇంటికి వచ్చాక... అప్పటికి ఎన్నిసార్లు రమ్మని పిలిచినా

రానని మొండికేసిన దానిని కాస్తా... మెత్తబడి మా రెండోవాడికి నేనూ వస్తానంటూ కబురెట్టాను...'' అంటూ ఆవిడ నిట్టూర్చింది.

''అదేమిటత్తా... నీ గొంతులోని హుషారంతా హుష్‌కాకీ లా ఎగిరిపోయిందీ... పైగా గాలి తీసేసిన బెలున్‌లా... అలా అయిపోయావు...?'' అంటూ ఆరా తీసిందొకావిడ.

''పెద్దవాళ్ళకి అమెరికా వెళ్ళటం అంటే.... ప్రయాణపు అగచాట్లూ.... ఆపసోపాలూనూ! అవి వదిలేస్తే... ఆదేశాన్ని చూసీ చూడగానే కొంతా, ఆ తర్వాత మరింతా ఆశ్చర్యం అనుకో...!''

''ఏమైంది పిన్నీ... అంత ఆశ్చర్యం ఎందుకూ....? అద్భుతమైన ఆ దేశాన్ని చూసినందుకేనా...?''

ఎదురయిన ఆ ప్రశ్నకి పున్నమ్మ ''చెబుతానుండూ...'' అంటూ చిరునవ్వు చిందించింది.

"మా వాడిని 'ఇదేంట్రా... ఈ దేశంలో కూడా మన దేశంలో లాగే ఎండ... ఎండలా... ఆకాశం... ఆకాశంలాగే ఉందీ?' అనడిగా. 'మరి... ఇంకెలా ఉంటుందీ?' అని వాడుకూడా విస్తుబోయాడు! పైగా 'ఎక్కడన్నా మన్నూ మశానం... నీరూ నిప్పూ ఒకేలా ఉండవా...?' అని ఇంతెత్తున చిరాకూ పడ్డాడు! 'అన్నీ ఒకలాగే ఉంటె... ఇంత దూరాభారం పడతాలేస్తా... వచ్చే ఆయాసం ఎందుకూ....? ఖర్చులూ అవీ మామూలుగా ఉండక మండిపోతాయి కూడా కదా...' అని నేనూ విసుక్కున్నాను.

దానికి వాడు కొంచెం శాంతంగా చూసి 'అవునూ.. అమెరికా అంటే... అదీ ఈ భూమండలం మీద ఉన్న ఒక దేశం అని మర్చిపోతే ఎలా అమ్మా...?' అన్నాడు అనునయంగా.

'ఏమోరా... అందరి కబుర్లూ విని అమెరికా అంటే... ఇక్కడ మట్టి మట్టిలా కాకుండా... ధగధగలాడుతూ బంగారంలా మెరిసిపోతుంది కాబోలూ, ఆకాశం కూడా ఎపుడూ ఇంద్రధనుసులోని రంగులతో మిరుమిట్లు గొలుపుతూంటుందీ అనే అంచనాలతో వచ్చినందు వలనేమో కొంచెం ఆశాభంగం కలిగిందిలే...!' అని వివరంగా చెప్పా!''

చాలామంది నవ్వులు ఒలకబోశారు. ''అయితే అత్తా... వెంటనే వెనుదిరిగి వచ్చేశావా...? చాలానాళ్ళు ఉన్నావని విన్నానే...!'' అని ఒక ప్రశ్న వచ్చింది.

''బావుందే నీ మాట... వెళ్ళటం వరకే మన ఇష్టంగానీ, ఎపుడంటే అపుడు వెనక్కి ఎలా వచ్చేస్తాం...? ముందుగా అనుకుని బోలెడంత ఖర్చుతో తిరుగు ప్రయాణానికీ కలిపి కదా టిక్కెట్టు కొనుక్కోవటం...! అయినా ఇక్కడ నాకేం ఉద్యోగం సద్యోగం ఉందని హడావుడిగా వచ్చేస్తానూ... తీరుబడిగా అన్నీ చూసి తెలుసుకున్నాకనే రావాలనుకున్నా! పైగా అడిగినవాళ్ళకీ, అడగని వాళ్ళకీ కూడా వూరిస్తూ అమెరికా కబుర్లు గొప్పగా చెప్పాలికదా...!'' అంది కొంచెంగా నవ్వి.

''అవునవునూ... అన్ని కబుర్లూ చెప్పు పెద్దమ్మా... మేం అమెరికా వెళ్లొచ్చినవాళ్ళం కాదుగా, నువ్వు చెప్పేవన్నీ చెవుల్ని దొప్పలుగా చేసుకుని గొప్పగా వింటాంలే...!''

ఆ మాటని ఆవిడ వ్యంగ్యంగా అందేమో అన్న అనుమానంతో ఆవిడ వంక పరిశీలనగా చూసిన పున్నమ్మ ఏమనుకుందో ఏమోగానీ చెప్పటానికి ఉద్యుక్తురాలైనట్లు కంఠం సవరించుకుంది.

''ఇక్కడా... అక్కడక్కడా కనుపిస్తున్న విడ్డూరం నా కొడుకు ఇంట్లోనూ కనబడిరది! అర్థంకాక నేనేమో కలవరపడిపోయా... ఇంత దూరదేశం వచ్చి... మావాడెంత కూడబెట్టి ఉంటాడోనని మురిసిపోతున్న నాకు... కరువు బాధతో ఎంతగా తల్లడిల్లిపోతున్నాడో అనిపించి దిగులుపడ్డా! మరీ భారీ నగలు లేకపోయినా... కనీసం చెవులకు వీసమెత్తు బంగారం అయినా లేదు సరికదా జుట్టుకింత నూనె రాసుకోవటానికీ లేనట్లుగా చింపిరి జుత్తులతో, చిరిగిన బట్టలతో తిరుగుతున్న మనవరాళ్ళిద్దర్నీ చూసి విలవిలాడిపోయా! అదే మాట మా వాడితో అంటే ఫకాలున నవ్వి... 'అది కరువు కాదమ్మా... ఫ్యాషన్' అన్నాడు! చిరిగిన బట్టలేసుకునే దరిద్రం ఫ్యాషన్ లోకి ఎలా వస్తుందీ అని ఎంత ఆలోచించినా నాకు అంతు చిక్కలేదు! నువ్వు ఇల్లు దాటకుండా నలుగురిలోకి రాకుండా ఉండిపోతే... ఈ రోజుల్లోని పిల్లల ఫ్యాషన్‌లూ, పద్ధతులూ ఎలా తెలుస్తాయీ...?' అని చివరకు నన్నే తప్పుపట్టాడు!

వాళ్ళు మనదేశం వచ్చినపుడు... నేను పిల్లలకి కొన్ని బంగారం కూడా కనిపించక నన్నో అనుమానం వేధిస్తోంది... ఆ బంగారం తాకట్టు పెట్టేరేమో అన్నదే నా అనుమానం! ఉన్నది కాస్తా ఏ పేకాటలోనైనా పోగొట్టుకుంటే... తాకట్టులు తప్పవుగా మరీ!

కోడలు కూడా నవ్వు మొహంతో వడ్డాణం లాంటి పెద్ద పెద్ద నగలూ, హారాలూ చాలానే కొన్నాం. అవన్నీ లాకరులోనే ఉంటాయి! ఎవరిదైనా పెద్ద ఫంక్షన్‌లకు మాత్రం వేసుకుని రెడీ అవుతారని చెప్పింది. దాంతో కొంచెం స్థిమితపడ్డా.''

పున్నమ్మ చెప్పిన తీరుకు కొందరు పగలబడి నవ్వారు. ''అయితే పెద్దమ్మా... అమెరికా వెళ్ళి చూడాల్సిన అవసరం లేదంటావ్... అంతేగా...?'' అని మళ్లీ అడిగినావిడకు పున్నమ్మ చిరునవ్వుతో చెప్పింది.

''అమ్మాయ్... నేనన్నీ నాణేనికి ఒకవైపు ఉన్న దానిగురించే చెప్పా. రెండో వైపూ చూడాలిగా. నేర్చుకోవాల్సిన ఎన్నో మంచి విషయాలూ ఉన్నాయి... కొన్ని రోజులకే అవన్నీ తెలిసాయి కూడా...! వివరం తెలుసుకోకుండా ఒక అభిప్రాయానికి వచ్చేసి... అదే నిజమన్నట్లు చెప్పటమూ తప్పేకదా!

ముఖ్యంగా పచ్చని లాన్లతో శుభ్రంగా ఉన్న రోడ్లను చూస్తూంటేనే... ముద్దెట్టుకోవాలన్నంత ముచ్చటేసింది! ఇక్కడలాగే అక్కడా రకరకాల వేషభాషలవాళ్ళూ, వికారాలు పోయేవాళ్ళూ ఉన్నారు.

వాళ్ళ రంగు, రూపురేఖలతీరూ వేరేగా ఉంటాయా... మేం ఒక చోటకి వెళ్ళినపుడు... 'చిన్నాడా... ఇక్కడా కొందరు అచ్చం మనవాళ్ళల్లాగే ఉన్నార్రా...!' అని కేక పెట్టాను! మరి... మనలాగే ఉన్నవాళ్ళని చూసేసరికి నాకు ఉత్సాహం తన్నుకొచ్చేసింది... అంత బిగ్గరగా అరిచినట్లుగా మాట్లాడకూడదంటూ మావాడు కసిరి అసలు విషయం చెప్పాడు 'మనవాళ్ళల్లాగే ఉండటం కాదు, అచ్చంగా మనవాళ్ళే... మన దేశస్థులే' అన్నాడు. 'ఇంతమందా...! అంటే... 'ఇప్పట్లో... చాలామందే చదువులకో, ఉద్యోగాలకో వచ్చి... ఇక్కడే బావుందని ఉండిపోతున్నారుగా...!' అన్నాడు.

'అవునుగానీ.... మనం ఎవరో గొప్పవాళ్ళింటికి వెళ్ళామనుకో... వాళ్ళ ఇల్లు ఎన్ని వన్నె చిన్నెలతో అందాలు ఒలకబోస్తూ గొప్పగా ఉన్నా.... మనకు అక్కడే

ఉండిపోదామనిపిస్తుందా...? మనింటికే మనం వచ్చిపడాలనుకుంటామా...! అలాగే మీరూ ఈ దేశం ఎంత బావుంటే మాత్రం ఇక్కడే ఉండిపోవటం ఎందుకూ...!' అని నా సందేహం బయట పెట్టాను.

'ఏం... మన ఉన్న ఊళ్ళో చదువైపోతే, పై చదువులకీ, ఉద్యోగాలకీ పొరుగూరు వెళ్ళటం లేదూ...? ఇపుడు... దేశాల మధ్య దూరం తగ్గిపోయి... మంచి చదువులకో, ఉద్యోగాలకో ఇతర దేశాలకీ వెళ్తున్నారు! పక్కవాళ్ళ ఇల్లు చక్కగా, సౌకర్యంగా ఉండి మనకూ నచ్చిందనుకో, వాళ్ళ పద్ధతులూ, ఆనుపానులూ అన్నీ తెలుసుకుని వచ్చి... మనమూ అలాంటి ఇల్లు ఏర్పరచుకోవాలనే కోరిక కలగటం సహజమేగా... మేమూ ఇతర దేశాలకి వచ్చి... ఎవరిమీదో ఆధారపడి... ఎవరింట్లోనో ఉండిపోయినట్లు కాకుండా కష్టపడి పనిచేస్తున్నాం... కొందరు ఎంతో కొంత వెనకేసి... మన దేశం వచ్చేసి... నచ్చినట్లు గొప్పగా ఉండగలుగుతున్నారుకూడా! మరికొందరేమో... ఎక్కడయితేనేం, ఎవరి బ్రతుకు వాళ్ళదీ, మనష్యుల మధ్యేగా ఉంటున్నాం అనుకుంటూ అలవాటైన చోటే స్థిరపడి పోతున్నారు! ఎవరి ఆలోచనలు, ఇష్టాలూ వారివేగా' అని ఎదురు ప్రశ్నలు వేసాడు. అదీ నిజమేననిపించింది...! ''

''అయితే... పున్నమ్మా... ఇంతకీ ఏం అంటావ్... ఆ దేశం వెళ్ళటం మంచిదా, కాదా?'' అనడిగిందొక పెద్దావిడ.